విద్యా రుణాల్లో రాష్ట్రం ముందంజ

బెంగళూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఉన్నత విద్యారుణాలకు సంబంధించి కర్ణాటక రాష్ట్రం రెండోస్థానంలో ఉందని ఒక నివేదిక వెల్లడైంది. ఐదేళ్లలో కర్ణాటకలో విద్యారుణాలకు సంబంధించి అర్జీలు సమర్పించినవారిలో మహిళలు 30.7శాతం ప్రగతి ఉన్నట్లు తేలింది. సాంకేతిక విద్య, వృత్తిపర విద్యలకు సంబంధించి ఇటీవల ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఇందుకు సంబంధించిన నివేదిక గురువారం విడుదలైంది. బెంగళూరు తర్వాత మైసూరు, బెళగావి, ధారవాడ వంటి ద్వితీయశ్రేణి నగరాలలో సైతం ఉన్నత విద్యకోసం గతంతో పోలిస్తే మహిళలు రుణాలు పొందడం అధికంగా ఉందని నివేదికలో ప్రస్తావించారు.



ఇన్వెస్ట్ కర్ణాటక వేదికపై కేంద్రమంత్రి సోమణ్ణ, డీసీఎం డీకే శివకుమార్, మంత్రి ఎంబీ పాటిల్, పరిషత్ సభాపతి హొరట్టి

లక్ష్యానికి చేరుకున్నాం

- మంత్రి ఎంబీ పాటిల్
- ఇన్వెస్ట్ కర్ణాటకతో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు
- బెంగళూరు వెలుపలే 75 శాతం..
- ఉత్తర కర్ణాటకలో 45 శాతం..

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో భాగంగా ఇన్వెస్ట్ కర్ణాటకకు పెట్టుబడులు అనుకున్న లక్ష్యాన్ని చేరాయని రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ వెల్లడించారు. డీసీఎం డీకే శివకుమార్‌తో కలసి ఇన్వెస్ట్ కర్ణాటక ద్వారా ప్రగతిని వివరించారు. చివరిరోజు శుక్రవారం ప్యాలెస్ మైదానం ఇన్వెస్ట్ కర్ణాటక ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. 10.27 లక్షల కోట్లు పెట్టుబడుల రూపంలో సాధ్యం కానున్నాయని కనీసం లక్షమందికి ఉద్యోగాలు వరించనున్నాయన్నారు. ఇన్వెస్ట్‌మెంట్ ఒప్పందాలు, ప్రకటనలు 4.03 లక్షల కోట్లు సాధ్యం కాగా ఒప్పందాల రిజిస్ట్రేషన్ 6.23 లక్షలకోట్లు వచ్చాయన్నారు. పెట్టుబడులలో 75శాతం బెంగళూరుతో సంబంధం లేకుండానే సాధ్యం కావడం ఆశాజనకంగా ఉందన్నారు. 45శాతం పెట్టుబడులు వెనుకబడిన ఉత్తర కర్ణాటక జిల్లాలకు వరించాయన్నారు. సన్‌రైజ్ సెక్టార్ ఉత్పత్తి విభాగంలో 1.38 లక్షలకోట్లు, జనరల్ ఉత్పత్తిరంగంలో 1.05 లక్షలకోట్లు, కోర్ మాన్యుఫాక్చరింగ్ విభాగంలో 1.59 లక్షలకోట్లు, రెన్యూవబుల్ ఎనర్జీ 4.25 లక్షల కోట్లు, ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో 1.07 లక్షల కోట్లు, స్టార్టప్ కేపిటల్ రూ.89.86 వేల కోట్లు వచ్చాయన్నారు. వీటిలో జేఎస్‌డబ్ల్యూ సంస్థ 1.20 లక్షలకోట్లు రెన్యూవబుల్ ఎనర్జీ, సిమెంట్, స్టీల్ వ్యాపారాలకు, బాల్డోటా స్టీల్ సంస్థ రూ.54వేల కోట్లతో స్టీల్‌ప్లాంట్‌ను, ల్యాంబ్‌రీసెర్చ్ రూ.10వేలకోట్ల ఆర్‌అండ్‌డీ విభాగానికి, ఓల్వో సంస్థ రూ.1400 కోట్లు ఇవి ట్రక్స్ కోసం, సంవర్ధన మదర్సన్ ఇంజనీరింగ్ అసెంబుల్డ్ ఫెసిలిటీస్ రూ.3,700 కోట్లు, ఎంవీ ఎనర్జీ రూ.15వేల కోట్లు, ఆర్సెలెక్ సంస్థ రూ.5వేలకోట్లు, పీఏఎస్ఎల్ హెలికేప్టర్ అసెంబుల్డ్ లైన్ ఎయిర్‌బస్, గస్ మాన్యుఫాక్చరీ రూ.1530 కోట్లు, మహీంద్రా సస్టెన్ ప్రైవేట్ లిమిటెడ్ 36వేల కోట్లు, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ రూ.22,200 కోట్లు, ఎప్సిలాన్ గ్రూప్ రూ.15,350 కోట్లు, సజలన్ ఎనర్జీ రూ.21,950 కోట్లు, ఇఎస్ఆర్ అడ్వైజర్స్ రూ.2500 కోట్లు, టీవీఎస్ మోటార్ కంపెనీ రూ.2వేల కోట్లు పెట్టుబడులు పెట్టాయి. వందలకోట్లలో పలు కంపెనీలు పెట్టుబడులకు అంగీకరించాయి.

ఇన్వెస్ట్ కర్ణాటక ప్రారంభ సదస్సులో కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం సిద్దరామయ్య పాల్గొనగా పారిశ్రామికవేత్తలలో ఆనంద్ మహీంద్రా, సజ్జన్‌జిందాల్, కిరణ్ మజుందార్‌షా, గీతాంజలి కిర్లోస్కర్ భాగస్వాములయ్యారు. ఇండస్ట్రియల్ పాలసీని తీసుకొచ్చామని తద్వారా 2025-30 మధ్యకాలంలో రాష్ట్రంలో పెట్టుబడులకు స్వర్గధామం కావాలని భావిస్తున్నామన్నారు. సబ్సిడీలు, పరిశోధనలు, మౌలిక సదుపాయాలతోపాటు సింగిల్ విండో ద్వారా అన్ని సదుపాయాలు కల్పించదలిచామన్నారు. 14 విభాగాలలో అవార్డులు ప్రదానం చేశామని, రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పరిశ్రమలు కొనసాగిస్తున్న పారిశ్రామికవేత్తలు 38 మందికి అవార్డులు ప్రదానం చేసినట్లు మంత్రి పాటిల్ తెలిపారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ సదస్సుకు ఆస్ట్రేలియా, యూకే, సౌత్‌కొరియా, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, థాయ్‌లాండ్, తైవాన్, డెన్మార్క్, మలేషియా, జర్మనీదేశాల ప్రతినిధులు భాగస్వాములయ్యారన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ పారిశ్రామిక దిగ్గజాలు ఇన్వెస్ట్ కర్ణాటకలో పాల్గొనడం, పెట్టుబడులకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. చివరిరోజు కేంద్రమంత్రి సోమణ్ణ, సభాపతి బసవరాజ హొరట్టి, మంత్రులు ప్రియాంకఖర్గే, హెచ్‌కే పాటిల్, జార్జ్, కృష్ణబైరేగౌడతోపాటు కాంగ్రెస్ సీనియర్ నేత ఎంపీ శశిథరూర్ పాల్గొన్నారు.

పాశ్చాత్య దేశాలలో సంస్కృతి పునరుద్ధరణ

- కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్



సదస్సులో మాజీ క్రికెటర్ అనిల్‌కుంబ్లే, అంజుబాబిజార్జ్

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పాశ్చాత్యదేశాల్లో 500 సంవత్సరాల తర్వాత సంస్కృతి సంప్రదాయాలు పునరుద్ధరణకు నోచుకుంటున్నాయని ఇది ఆసియా ఖండం 21వ శతాబ్ది ప్రగతికి మార్గదర్శకంగా ఉందని కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్ అన్నారు. అలయెన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వార్షికోత్సవంలో భాగంగా మూడు రోజుల చర్చాగోష్ఠి గురువారం ప్రారంభమైంది. సుమారు వందమందికిపైగా ప్రముఖ వక్తలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గ్లోబల్‌స్థాయిలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, సృజనాత్మకతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అయితే మరింత పరిశోధనలు కూడా కీలకమే అన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేథ అంశం ఎంతో కీలకంగా ఉందని, ఈ రంగంలోనూ మార్పులు వస్తున్నాయన్నారు. ఇలా పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. శుక్రవారం సదస్సులో ప్రముఖ అథ్లెట్ అంజుబాబిజార్జ్, మాజీ క్రికెటర్ అనిల్‌కుంబ్లే ప్రసంగించారు. అనిల్‌కుంబ్లే మాట్లాడుతూ ఓటమి ప్రయాణంలో ఒక భాగం మాత్రమే అని భావించాలన్నారు. ఓటమి నుంచి గెలుపు అన్వేషణకు ప్రయత్నించాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలకు చేరుకోవచ్చున్నారు. ఏకాగ్రత, నైపుణ్యత యువ విద్యార్థులకు కీలకమైన అస్త్రాలు అన్నారు. పద్మశ్రీ గ్రహీత డాక్టర్ అంజుబాబిజార్జ్ మాట్లాడుతూ ఒక మార్గదర్శకుడు ప్రపంచాన్ని మార్చగలరన్నారు. నాకు మెంటార్‌గా నా భర్త వ్యవహరించారని, నా ప్రయాణంలో ఎన్నో కీలకపాత్రలు పోషించారన్నారు. అందుకే నేను ఊహించినదానికంటే ఎక్కువ సాధించానన్నారు. ప్రస్తుతం బెంగళూరులో విద్య, క్రీడలలో ఎన్నో సౌకర్యాలు మీ ముంగిట ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు పాఠాలతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకుని రాణించాలని పిలుపునిచ్చారు.

యూపీ తరహాలో బుల్డోజర్ వాడే పరిస్థితి లేదు

- మైసూరులో పోలీస్‌స్టేషన్‌పై దాడి కేసులో 16 మంది అరెస్టు
- హోం మంత్రి పరమేశ్వర్



బెంగళూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసినవారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. మైసూరు నగరంలో హోం మంత్రి పరమేశ్వర్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఉదయగిరి పోలీస్ స్టేషన్ ఘటనకు సంబంధించి 16మందిని అరెస్టు చేశామని వెయ్యిమందిపై కేసు నమోదు చేశామని అయితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రం తరహాలో బుల్‌డోజర్‌లు వాడేంతటి పరిస్థితి లేదన్నారు. ఎందుకు ఇటువంటి సంఘటన జరిగిందనేది ప్రాథమికంగా తెలుసుకునేందుకు వచ్చానన్నారు. ఇప్పటికే దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందన్నారు. మరింతమందిని అరెస్టు చేస్తామన్నారు. సీసీటీవీ ఫుటేజీలలోని ఫొటోలు, వీడియోల ఆధారంగా ఆరోపితులను గుర్తిస్తున్నామన్నారు. వైరల్ అయిన వీడియోలో ఏం ఉందనేది తెలుసుకుని అరెస్టు చేశామన్నారు. కాగా సీఎం సిద్దరామయ్య అధికారిక నివాసం కృష్ణలో మైసూరు సంఘటనపై ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. మైసూరు ఎస్పీ, నగర పోలీస్ కమిషనర్, డీజీపీతోపాటు పలువురు పాల్గొన్నారు. తప్పు చేసినవారు ఎవరైనా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటామంటే ఉపేక్షించేది లేదని పోలీసులకు భరోసా ఇచ్చారు. అమాయకులకు ఇబ్బంది కలిగించరాదని సూచించారు. పోలీస్‌స్టేషన్‌పై రాళ్లు రువ్వినవారు, రెచ్చగొట్టినవారందరిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

మైలార లింగేశ్వర కార్ణిక మహోత్సవం

నిండుకుండ తొణకిసలిదే.. పరాక్..! గొరవయ్య భవిష్యవాణి



కార్ణికం చెబుతున్న గొరవయ్య

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హువినహడగలిలో శుక్రవారం మైలారలింగేశ్వర కార్ణిక మహోత్సవం లక్షలాది మంది భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. దేవస్థానం వంశపారంపర్యంగా ధర్మకర్త వెంకప్పయ్య ఒడెయార్ గుర్రంపై పవిత్రస్థలానికి చేరుకుని స్వామికి ప్రతిష్ఠించిన విగ్రహాల ఉత్సవం పాల్గొన్నారు. గొరవయ్యల ఊరేగింపుగా పూజా స్థలానికి చేరుకున్నారు. ఏళుకోటి ఏళుకోటి అనే నినాదం మారుమోగింది. సుక్షేత్ర వారసత్వానికి ప్రతీక అయిన తన విల్లును పైకెత్తిన గొరవయ్య రానున్న దివ్య స్వరం పలికి కిందకు దూకారు. ఈ ఏడాది మైలారలింగేశ్వర కారణజన్ముడి మాటలే ప్రవచనంగా నిలుస్తాయని భక్తులు నమ్ముతారు. తుంబిద కొడ తుణకిసలిదే(నిండుకుండ తొణుకుతుంది). ప్రస్తుత సంవత్సరం కార్ణిక భాషలో మిశ్రమ ఫలితాలు ఉన్నాయని, భక్తులు ఈ పదబంధాన్ని అర్థం చేసుకున్నారు. దేశంలో సమృద్ధిగా వర్షాలు, పంటలతో సుసంపన్నంగా ఉంటుందని భక్తులు గొరమ్మ పలికిన పలుకులకు అర్థం చెబుతున్నారు.



కార్ణికోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎస్సీ, ఎస్టీ నేతల సమావేశానికి.. కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్

బెంగళూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన మంత్రులు ప్రత్యేకంగా నిర్వహించదలిచిన సమావేశానికి కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో గ్రూపు విభేదాలు మరోసారి భగ్గుమనేలా ఉన్నాయి. రెండురోజులపాటు ఢిల్లీలో మకాం వేసిన ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి పార్టీ అగ్రనేతలతో చర్చించి కనీసం విందు, సాధారణ భేటీలకు అభ్యంతరాలు సరికాదని వివరించినట్లు తెలుస్తోంది. దీంతో అధిష్ఠానం సమావేశానికి అనుమతులు ఇచ్చింది. మంత్రులు పరమేశ్వర్, సతీశ్ జార్కిహొళి, రాజణ్ణ, మహదేవప్ప ఎస్సీ, ఎస్టీ నేతల సమావేశం జరిపేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం మంత్రులు సతీశ్‌జార్కిహొళి, మహదేవప్ప ప్రత్యేకంగా భేటీ అయి చర్చలు జరిపారు.

ఈ ఏడాది జనవరి ప్రారంభం రోజున సతీశ్ జార్కిహొళి ఇంట కొందరు మంత్రులు విందు జరిపారు. ఆ తర్వాత నాలుగు రోజులకు హోం మంత్రి పరమేశ్వర్ విందుకు ఆహ్వానించగా డీసీఎం డీకే శివకుమార్ అధిష్ఠానం ద్వారా రద్దు చేయించారు. అప్పటినుంచి అధిష్ఠానంతో అనుమతులకోసం ప్రయత్నించి సాధించుకున్నారు. ఈ వర్గమంతా సీఎం సిద్దరామయ్యకు ఆప్తులుగా ఉన్నవారు. దీంతో డీసీఎం డీకే శివకుమార్‌కు పరోక్షంగా షాక్ ఇచ్చినట్లు అవుతోంది. ఎస్సీ, ఎస్టీ నేతల భేటీ జరిగితే కాంగ్రెస్ అధ్యక్షుడి మార్పు అంశం ప్రస్తావనకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

విహంగ విన్యాసాలకు వీడ్కోలు..!



బై..బై..: విహంగాలకు వీడ్కోలు పలుకుతున్న చిన్నారి



యుద్ధ విమానాల విన్యాసాలు



- చివరిరోజు పోటెత్తిన సందర్శకులు
- ఫైటర్ జెట్‌ల విన్యాసాలకు ఫిదా
- సూర్యాస్తమయం వరకు సాగిన విన్యాసాలు

బెంగళూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఏరోఇండియా-2025 విమానాల ప్రదర్శనకు వీడ్కోలు పలికారు. ఐదురోజులపాటు బెంగళూరు యలహంక ఎయిర్‌బేస్‌లో వైమానిక ప్రదర్శనలు కొనసాగాయి. 15వ విడత ఎయిర్‌షో విజయవంతమైంది. గతంలో చోటు చేసుకున్న పలు సంఘటనల నేపథ్యంలో ఎయిర్‌ఫోర్స్ డిఫెన్స్ విభాగాలు సంయుక్తంగా కార్యాచరణ జరిపి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎయిర్‌షోను నిర్వహించారు. గతంలో కార్ పార్కింగ్ ప్రదేశంలో అగ్ని ప్రమాదంతో వందలాదికార్లు కాలిపోయాయి. ఓ ఎయిర్‌క్రాఫ్ట్‌కు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. అటువంటి వాటికి అవకాశం లేకుండా 15వ విడత ఏరో ఇండియా ప్రదర్శనలు అద్భుతం అనిపించేలా నిర్వహించారు. ఈనెల 10న కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రదర్శనలు ప్రారంభించారు. మూడురోజులపాటు బిజినెస్, డిఫెన్స్ తదితర విభాగాలకు మాత్రమే అవకాశం ఉండేది. 13, 14 తేదీలలో ప్రజలందరూ వీక్షించేందుకు అవకాశం ఉండడంతో లక్షలాదిమంది తరలివచ్చారు.

- ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, హెచ్‌ఏఎల్ నిర్మించిన తేజస్ ఎల్‌సీఏ, ఎల్‌హెచ్ హెలీక్యాప్టర్, సూర్యకిరణ్ విమానాలు, రష్యానిర్మిత ఎస్‌యూ 57, యూఎస్ ఎఫ్35తోపాటు అనేక ఫైటర్‌జెట్‌లు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఐదురోజులపాటు సాగిన వైమానిక ప్రదర్శనలను లక్షలాదిమంది వీక్షించారు. దేశ విదేశీ యుద్ధ విమానాలు, ట్రెయినీ విమానాల అబ్బురపరిచే విన్యాసాలను చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. ఆసియాఖండంలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన ఏరోఇండియా-2025 ద్వారా రక్షణరంగ సామర్థ్యాన్ని ప్రదర్శించే వేదికగా సాగింది. డిఫెన్స్, వైమానిక ఉపకరణాల పరిశ్రమ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణ అయ్యాయి. హెచ్‌ఏఎల్, బీఈఎల్, అదాని గ్రూప్స్, రిలయెన్స్‌తోపాటు వందలాది దేశ విదేశీ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. పలుదేశాలతో రక్షణ ఉపకరణాలకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయి. చివరిరోజు సూర్యాస్తమయం దాకా విమానాల విన్యాసాలు కొనసాగగా సందర్శకులు సంతోషంగా గడిపారు. చివరగా వీడ్కోలు పలికేవేళ విమానాల విన్యాసాలకు చేతులుఊపి సందర్శకులు వీడ్కోలు పలికారు. కాగా చివరిరోజు సందర్శకులు పోటెత్తడంతో యలహంక సమీప ప్రాంతాలు ట్రాఫిక్‌రద్దీతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హెబ్బాళ - యలహంక మార్గంలో సుమారు రెండుమూడు గంటలపాటు రద్దీ కొనసాగింది.






హృదయ ఆకారంలో విన్యాసం



యలహంక ఎయిర్‌బేస్‌లో యుద్ధవిమానాలు, ప్రజల సందడి



యలహంక ప్రధాన మార్గంలో ట్రాఫిక్

బాల వసంతం


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జేఎన్టీయూ వీసీ సుదర్శనరావు


పదండి పోదాం.. ప్రదర్శనలకు..






సూపర్.. సూపర్..


బాలోత్సవంలో ప్రసంగిస్తున్న డాక్టర్ గేయానంద్

అనంత బాలోత్సవాలు ఆరంభం

శాస్త్రీయ, సాంస్కృతిక ప్రదర్శనలు

ఉత్సాహంగా తలపడిన బాలలు


నాటకంలో బాల కళాకారులు


ఉండమ్మా.. తీర్చిదిద్దుతా..


పాల్గొన్న జనం


ఆనంద బంధనం..

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అనంత ఐదో బాలోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని లలితకళా పరిషత్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్‌లో ఐదు వేదికలపై చిన్నారులు అద్భుత ప్రదర్శనలతో అలరించారు. శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు, నాటకాలతో అబ్బురపరిచారు. సైన్స్ ఫేర్‌లో తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. వందలాది మంది చిన్నారులు, వారి తల్లిదండ్రులు, బంధుమిత్రులు, నగర ప్రముఖుల రాకతో సంబరాలలో సందడి కనిపించింది. జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై, జాతీయ పతాకావిష్కరణ చేసి బాలోత్సవాలను ప్రారంభించారు.


పాటల పల్లకిలో..

మంచిని స్వీకరించాలి..

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని చిన్నారులు మంచికి ఉపయోగించేలా తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని జేఎన్టీయూ వీసీ సుదర్శనరావు సూచించారు. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్‌లు మంచితోపాటు చెడుకూ కారణమవుతున్నాయని అన్నారు. మంచిని మాత్రమే చిన్నారులు స్వీకరించేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఏటా బాలోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.


నాట్యం చేస్తూ..



సృజన వెలుగులోకి..

చిన్నారులలో దాగిన సృజనాత్మకతను వెలుగులోకి తెచ్చేందుకు బాలోత్సవాల వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. బాలోత్సవాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ప్రదర్శనల అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, కోశాధికారి జిలాన్, న్యాయవాది రామకృష్ణారెడ్డి, కంబదూరి షేక్ నబీరసూల్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ అరుంధతి, ఇన్నర్ వీల్ క్లబ్ చైర్‌పర్సన్ జయంతి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేకన్న, ఎల్‌కేపీ ప్రధాన కార్యదర్శి పద్మజ, సభ్యుడు రామగోవింద్ సాగర్, బాలోత్సవ కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, లింగమయ్య, గోవిందరాజులు, నాగేంద్ర, సరళ, దేవేంద్రమ్మ, ఏజీ రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఎంత బావున్నారో..

పోటాపోటీగా..

జిల్లాలోని వివిధ ప్రాంతాల పాఠశాలల విద్యార్థులు బాలోత్సవాలలో భాగం పంచుకున్నారు. తమ ప్రతిభా పాటవాలను చాటేందుకు పోటీ పడ్డారు. మూడురోజులపాటు జరిగే బాలోత్సవాల ఆవరణకు 'కల్లూరు సుబ్బారావు ప్రాంగణం' అని పేరు పెట్టారు. ఒకటో వేదికకు నరసింహమూర్తి, గాజుల నారాయణస్వామి పేర్లు, రెండో వేదికకు జాకీర్ హుస్సేన్, మూడో వేదికకు షేక్ నాజర్, నాలుగో వేదికకు సీనియర్ పాత్రికేయుడు నందినేని దేవప్రసాద్, ఐదో వేదికకు మహిళా ఉద్యమ నాయకురాలు శకుంతలమ్మ పేర్లు పెట్టారు. మొదటి రోజు నిర్వహించిన పోటీలలో 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అకడమిక్ అంశాలలో వ్యాసరచన, కవిత, కథా రచన, క్విజ్, మెమోరీ టెస్ట్ తదితర పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక అంశాలలో జానపదం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు నిర్వహించారు.


బాల సైనికులు

మాతాశిశు మరణాల నివారణకు ఏఐ సాంకేతికత

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్

కూడేరు పీహెచ్‌సీలో జననీ మిత్ర యాప్ ప్రారంభం


అనూషకు ఇంటి వద్ద స్ర్కీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కూడేరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, మాతాశిశు మరణాలను నివారించేందుకు ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జననీ మిత్ర యాప్‌ను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ శుక్రవారం ప్రారంభించారు. మోడల్ పీహెచ్‌సీగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేసిన అనంతపురం జిల్లా కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కూడేరు మండలంలో తల్లీబిడ్డలకు సంబంధించి కొన్ని ప్రయోగాలు చేస్తున్నారని తెలిపారు. రక్తహీనత కారణంగా ప్రసూతి మరణాలు సంభవిస్తున్నాయని, వాటిని పూర్తిగా తగ్గించేందుకు జననీ మిత్ర యాప్ ఉపయోగపడుతుందని అన్నారు. అందులో గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుకోవచ్చునని అన్నారు. అనంతపురం జిల్లాలోని కూడేరు, పామిడి మండలాల్లో రక్తహీనత కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని తెలిపారు. అందుకే కూడేరును పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. అందుబాటులో ఉన్న డిజిటల్ సాంకేతిక వనరులను ఉపయోగించి.. రక్తహీనత, మతాశిశు మరణాలను నివారించడమే పైలెట్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జననీ మిత్ర యాప్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని, క్షేత్రస్థాయిలో వైద్యశాఖ సిబ్బంది బాధ్యతలు ఇచ్చామని తెలిపారు. స్వస్థి సంస్థతో కలిసి పనిచేస్తామని, ఆరు నెలల్లో మాతా శిశుమరణాల విషయంలో పెద్ద మార్పులు తీసుకువస్తామని అన్నారు. బాలింతలకు యాప్‌లోని అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అనంతరం క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షల విధానాన్ని పరిశీలించారు. వైద్యసేవలు, మందులు, ల్యాబ్ గురించి సిబ్బందితో మాట్లాడారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ యుగంధర్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


నిరవధిక సమ్మె కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. జేవీవీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిరవధిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ ప్రతిసారి సమ్మె చేస్తే తప్ప వేతనాలు అందుకునే పరిస్థితి లేదన్నారు. 10 నెలల వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాల పోషణ ఎలా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేపడుతున్నారన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, కార్యదర్శి రాము, నాగరాజు, వన్నూరుస్వామి, సోము, లోకేష్, మురళి, నాగేంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు డాక్టర్లకు మెమో

ఓపీకి డుమ్మాకొట్టిన ఫలితం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సస్పెన్షన్


ఆస్పత్రిలో విభాగాలను తనిఖీ చేస్తున్న డాక్టరు వెంకటేశ్వరరావు

అనంతపురంటౌన్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో విధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఉదయం 10గంటలకు, మధ్యాహ్నం 2.45 గంటలకు పల్మనాలజీ, సైకియాట్రీ విభాగాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో పల్మనాలజీ ఓపీలో డ్యూటీలో ఉండాల్సిన డాక్టరు సౌజన్యలక్ష్మి, సైకియాట్రీ ఓపీలో ఉండాల్సిన డాక్టరు అనిల్‌కుమార్ కనిపించలేదు. దీంతో ఆ ఇద్దరు డాక్టర్లకు మెమోలు జారీ చేశారు. అలాగే అనస్తీషియా విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి చిన్నప్పయ్య అదే విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళా సిబ్బంది పట్ల అసభ్యంగా వ్యవహరించినట్లు విచారణలో తేలడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఓపీలలో సంబంధిత డాక్టర్లు తప్పనిసరిగా ఉంటూ రోగులకు సేవలందించాలని ఆదేశించారు. ఇకనుంచి తనతోపాటు అడ్మినిస్ట్రేటర్, ఆర్ఎంఓలు ప్రతి రోజూ మూడుసార్లు ప్రతివిభాగాన్ని తనిఖీ చేయనున్నట్లు వెల్లడించారు. రెండుసార్లు చేసిన తప్పునే చేస్తే అలాంటి వారిపై కలెక్టరు, డీఎంఈలకు ఫిర్యాదు చేస్తామన్నారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు ప్రతి ఫైల్‌ను ఈఫైల్ విధానంలోనే పంపాలని, ఏ విభాగంలోనైనా రోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు.

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల మందికి కంటి పరీక్షలు

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్


విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

గార్లదిన్నె, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం కళ్లద్దాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి హాజరై విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల ద్వారా అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు అందజేస్తామన్నారు. తీవ్రమైన సమస్యలుంటే వారికి సర్జరీ చేసి మెరుగైన వైద్య సేవలందిస్తామని తెలిపారు.

నారా లోకేశ్ డైనమిక్ లీడర్

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డైనమిక్ లీడర్ అని సత్యకుమార్‌యాదవ్ ప్రశంసించారు. గత ప్రభుత్వంలో నాసిరకమైన ఆహారాన్ని మధ్యాహ్న భోజనంగా అందించారన్నారు. దీంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురయ్యారు. ఈ సమ్యలను పరిష్కరించేందుకు లోకేశ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే పౌష్టికాహారాన్ని అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఇంటర్మీడియేట్ వరకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తామన్నారు. స్కిల్స్ సెన్సెస్ చేసి భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి పొందేలా చదువుతోపాటు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారని వివరించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని శింగనమల నియోజకవర్గం గార్లదిన్నెలో మండలంలో ప్రారంభించడం ఎంతో సంతోషమన్నారు. అనంతరం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేయడం ద్వారా చదువుతో పాటు భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కంటి చూపులో లోపాలు ఉన్న విద్యార్థులకు ఇకమీదట ఆ సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీదేవి, డీఈఓ ప్రసాద్ బాబు, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ బండారు ఈరమ్మ, మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్‌నాయక్, ఎంఈఓలు తారా చంద్రానాయక్, మల్లికార్జున నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

పురంలో అవినీతి పంచాయితీ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పన్నుల శాఖ హిందూపురం సర్కిల్‌లో అవినీతి పంచాయితీ జరుగుతోంది. అక్కడ ఒక ఉన్నతాధికారి, డీసీటీఓ స్థాయి అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు నాలుగు వర్గాలుగా విడిపోయినట్లు సమాచారం. జీరో వ్యాపారం చేసే కీలక డీలర్ల వద్దకు ఈ నాలుగువర్గాలు నెల మామూళ్లకోసం వెళుతున్నట్లు తెలిసింది. దీంతో అక్కడి డీలర్లు బెంబేలెత్తుతున్నారట. ఇదే క్రమంలో వర్గాలుగా ఏర్పడిన అధికారులు, సిబ్బంది నాలుగు రోజులుగా జాయింట్ కమిషనర్‌కు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ అవినీతి పంచాయితీ నిగ్గు తేల్చేందుకు ఆ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఒకరిని విచారణ అధికారిగా నియమించారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

అఖిలభారత పంచాయతీ పరిషత్ చైర్‌పర్సన్ విశాలా ఈశ్వర్


విశాలా ఈశ్వర్‌ను సన్మానిస్తున్న పంచాయతీ సిబ్బంది

లేపాక్షి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలోని శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని అఖిల భారత పంచాయతీ పరిషత్ చైర్‌పర్సన్ విశాలా ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ఆలయాన్ని ఆమె సందర్శించారు. అర్చకులు.. ఆలయ చరిత్ర, విశేషాలను వివరించారు. అనంతరం దుర్గావీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం విశాలా ఈశ్వర్‌ను సత్కరించారు.

అప్పు మీద తప్పు

అప్పులు తీర్చడానికే అంతం..?

సావిత్రమ్మ హత్యకేసు ఛేదన

పోలీసుల అదుపులో నిందితుడు


సావిత్రమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి దొంగగా మారాడు. ఈక్రమంలో ఓ మహిళను సైతం హత్య చేశాడు. ఈనెలలో నగర శివారులో ఓ మహిళ హత్య జరిగింది. ఈ కేసులో కీలక నిందితుడిని నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో అతను అప్పుల నేపథ్యంలోనే ఈ హత్యకు పాల్పడినట్లు చెప్పుకొచ్చినట్లు తెలిసింది. యాసర్ అనే వ్యక్తి రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. ఈ క్రమంలో అతడి భార్య ఎలాగైనా సరే అప్పు తీర్చేయ్ అంది. దీంతో టీచర్స్ కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న బొమ్మాళి సావిత్రమ్మ గొంతును కత్తితో కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని ఐదుతులాల బంగారు గొలుసులను లాక్కెళ్లాడు. బంగారు నగలను తాకట్టు పెట్టే క్రమంలోనే పోలీసులు యాసర్‌ను అదుపులోకి తీసుకుని, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

పట్టపగలే..

నగర శివారులోని టీచర్స్‌కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న బొమ్మాళి సావిత్రమ్మ(63)ను ఈనెల ఆరో తేదీ పట్టపగలే గొంతుకోసి హత్య చేశారు. మధ్యాహ్నం 1.30 నుంచి 4గంటల మధ్యలో ఈ హత్య జరిగింది. సావిత్రమ్మ భర్త ఓబులేసు అటవీశాఖలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. కొన్నేళ్ల కిందటే ఆయన మృతి చెందారు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా ఉంటోంది. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్దకుమారుడు విజయ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన ప్రస్తుతం తన కుటుంబంతో కోవూరునగర్‌లో నివాసముంటున్నాడు. రెండో కుమారుడు జయకుమార్, కుమార్తె పూర్ణిమ అమెరికాలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు విజయ్‌కుమార్ ఆరో తేదీ మధ్యాహ్నం తన తల్లికి భోజనం క్యారియర్ ఇచ్చి వెళ్లాడు. సాయంత్రం 4.30గంటల సమయంలో ఇంట్లో పనులు చేయడానికి పనిమనిషి రమణమ్మ వచ్చింది. ఇంట్లో రక్తపు మడుగులో ఉన్న సావిత్రమ్మను చూసి ఆందోళనతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సావిత్రమ్మ గతంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసినట్లు చెబుతున్నారు. 2015లో ఆమె ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు సమాచారం.

మహిళపై కత్తితో దాడి



బాధితురాలిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న మహిళా పోలీసు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణమ్మ కాలనీలో నివాసముంటున్న బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు శైలజపై గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం కత్తితో దాడి చేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు... నారాయణమ్మ కాలనీలో శైలజ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. అందులో పైపోర్షన్‌లో నివాసం ఉంటూ కింద పోర్షన్‌లో బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్నారు. ఈమె భర్త శ్రీనివాసులు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం శైలజ నివాసం ఉంటున్న ఇంటికి గడియపెట్టి బ్యూటీపార్లర్‌ను తెరిచేందుకు కిందకు వచ్చారు. అనంతరం పై పోర్షన్‌కు వెళ్లారు. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లో జొరబడి ఉన్నాడు. వాకిలి తీసి లోనికి వెళ్లేసరికి శైలజ గొంతును పట్టుకుని కిచెన్‌లోనే ఉన్న చాకుతో చేతివేళ్లపై దాడి చేశాడు. ఆమె కేకలు వేయడంతో కిందకు పరుగులు తీశాడు. స్థానికులు అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించినా తప్పించుకుని పారిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని సీసీకెమెరాలు పరిశీలించిన ప్రయోజనం లేకపోయింది. గుర్తుతెలియని వ్యక్తి టీషర్ట్, షార్ట్‌తో వచ్చినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన శైలజను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

గురు మణిమాధవ చాక్యార్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత గురు మణి మాధవ చాక్యార్ 1899 ఫిబ్రవరి 15న కేరళ రాష్ట్రం కోజికోడ్ ప్రాంతంలో జన్మించారు. సంప్రదాయ బద్ధమైన కూడియాట్టం, సంస్కృత నాటకాలపై పట్టు సాధించారు. కనుబొమలతోనే సైగలు చేస్తూ ఎన్నో భావాలు పలికించడంతో 'రస అభినయ చక్రవర్తి'గా పేరొందారు. కూడియాట్టంకు సంబంధించి నాట్య కల్పద్రుమం రచన చేశారు. కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, కేరళ కళామండలం ఫెలోషిప్, తులసీ సమ్మాన్ ఆఫ్ మధ్యప్రదేశ్, గురువాయూర్ దేవస్వోం అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 1990 జనవరి 14న కన్నుమూశారు.

మాస్టర్ హిరణ్ణయ్య (జయంతి)



ప్రముఖ కన్నడ నటుడు, నాటక రంగ కళాకారుడు మాస్టర్ హిరణ్ణయ్య 1934 ఫిబ్రవరి 15న మైసూరులో జన్మించారు. ఆయన తండ్రి కే హిరణ్ణయ్య బాటలోనే నటుడిగా రాణించారు. 30 సినిమాలకుపైగా నటించారు. కథ, స్క్రీన్‌ప్లే కూడా అందించడమే కాక నేపథ్యగాయకుడిగా కూడా ప్రతిభ చాటారు. 'లంచావతార' నాటకం 45 సంవత్సరాలలో అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, ఇంగ్లండ్ తదితర దేశాలలో 11వేల సార్లకుపైగా ప్రదర్శించబడడం ఒక రికార్డుగా నిలిచింది. రే, కేర్ ఆఫ్ ఫుట్‌పాత్ 2, నెంబరు 73 శాంతి నివాస సినిమాలు ఆయనకు మరింత గుర్తింపు తెచ్చాయి. రాజ్యోత్సవ పురస్కారం, సంగీత నాటక అకాడమీ అవార్డు, అంకరు నిర్మాన్ స్వర్ణ అవార్డు, మహా అద్వైతి అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2019 మే 2న కన్నుమూశారు.

ఇరెనా సెండ్లర్ (జయంతి)



ఇరెనా స్టానిస్లావా సెండ్లర్ 1910 ఫిబ్రవరి 15న జన్మించారు. రెండో ప్రపంచ యుద్ధంలో నర్సుగా సేవలందించిన ఆమె పోలెండ్ దేశానికి చెందిన గొప్ప మానవతావాది, సంఘ సంస్కర్తగా గుర్తింపు పొందారు. 1935 నుంచి 1943 వరకు వార్సా నగరంలో సాంఘిక సంక్షేమ, ప్రజా ఆరోగ్యం విభాగంలో పనిచేశారు. పోలెండ్ దేశం నుంచి ఆర్డర్ ఆఫ్ వైట్ ఈగల్, ఇజ్రాయెల్ నుంచి రైటియస్ అమాంగ్ ది నేషన్స్ గుర్తింపు పొందారు. 98వ యేట 2008లో కన్నుమూశారు.

రాధారెడ్డి (పుట్టినరోజు)



కూచిపూడి రంగంలోనే కాక యావత్ కళాలోకానికి రాజా-రాధారెడ్డిలుగా సుపరిచితులైన రాజారెడ్డి, రాధారెడ్డి దంపతులు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారు. రాధారెడ్డి 1952 ఫిబ్రవరి 15న జన్మించారు. రాజారెడ్డి, రాధారెడ్డిలు వేదాంతం ప్రహ్లాదశర్మ దగ్గర శిష్యరికం చేశారు. ఏలూరులోని కళాక్షేత్రంలో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారు. న్యూఢిల్లీలో నృత్య తరంగిని అనే నాట్యపాఠశాలను ఏర్పాటు చేసి ఔత్సాహిక నాట్యకళాకారులను తీర్చిదిద్దుతున్నారు. దేశ విదేశాలలో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలను వేర్వేరుగా దంపతులు ఒకేసారి పొందడం ఒక రికార్డుగా నిలిచింది. ఆమె కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. సాంస్కృతిక రాయబారులుగా వందకుపైగా దేశాల్లో పర్యటించి ప్రదర్శనలు ఇచ్చారు.

మీరా జాస్మిన్ (పుట్టినరోజు)



జాతీయ పురస్కార నటి మీరా జాస్మిన్ 1982 ఫిబ్రవరి 15న కేరళ రాష్ట్రంలో తిరువల్లా ప్రాంతంలో జన్మించారు. మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ భాషల సినిమాలలో నటించారు. 2004లో పాదమ్ ఒన్ను - ఒరు విలాపం అనే కేరళ సినిమాకు జాతీయ ఉత్తమ నటి పురస్కారం అందుకున్నారు. కాగా ఉత్తమ నటిగా రెండు కేరళ రాష్ట్ర ఫిల్మ్ అవార్డులు, ఒక తమిళనాడు రాష్ట్ర ఫిల్మ్ అవార్డు, క్లైమామణి, వీ శాంతారం అవార్డులు అందుకున్నారు. తెలుగులో భద్ర, గుడుంబా శంకర్, గోరింటాకు తదితర సినిమాలు గుర్తింపు తెచ్చాయి.

బావిలో పడ్డ కారు

ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

శింగనమల, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామ సమీపాన కారు అదుపుతప్పి, బావిలో పడిపోవడంతో అనంతపురానికి చెందిన షాబుద్దీన్ (40) మరణించగా.. ఇర్ఫాన్ తీవ్రంగా గాయపడ్డాడు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని గుల్జార్ పేటకు చెందిన షాబుద్దీన్, ఇర్ఫాన్ జియో కంపెనిలో పని చేస్తున్నారు. కంపెనీ పని నిమిత్తం నాయనపల్లి క్రాస్ నుంచి నార్పలకు కారులో బయల్దేరారు. నడిమిదొడ్డి గ్రామ సమీపాన ఆవును తప్పించే ప్రయత్నంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న బావిలో పడిపోయింది. బావి నీటిలో కారు మునిగిపోయింది. అందులో ఉన్న షాబుద్దీన్ ఊపిరాడక మృతిచెందాడు. ఇర్ఫాన్ కారు డోర్ గ్లాస్ కాసత తెరుచుకుని ఉండడంతో బయటకు వచ్చే ప్రయత్నం చేశాడు. అయినా వీలుకాలేదు. సమాచారం అందగానే సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐలు విజయ్‌కూమార్, సాగర్ హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. బావిలో ఉన్న కారును ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. గాయపడ్డ ఇర్ఫాన్‌ను ఆస్పత్రికి తరలించారు. షాబుద్దీన్‌కు భార్య, ఇద్దరు కూమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.



కారును బావి నుంచి బయటకు తీస్తున్న దృశ్యం

అంతర్రాష్ట్ర నేర చరితుల అరెస్టు



మీడియాతో ఎస్పీ కుశాల్ చౌక్సి తదితరులు

బాగేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పలు నేరాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర నేరచరితులను పోలీసులు అరెస్టు చేశారు. సుమారు 20 కేసులలో వీరు నిందితులుగా ఉన్నారని చిక్కబళ్ళాపుర ఎస్పీ కుశాల్‌చౌక్సి శుక్రవారం మీడియాకు తెలిపారు. డిసెంబరు 20న గుడిబండ తాలూకా గంగానహళ్ళి అశ్వత్థనారాయణ అనే వ్యక్తి భూమి అమ్మిన సొమ్ముతో స్నేహితుడికి ఇచ్చేందుకు నారేపల్లికా కారులో వెళ్లాడన్నారు. ఇదే సందర్భంగా బాంబెసలీం గ్యాంగ్ దాడి చేసి అశ్వత్థనారాయణ స్వామి నుంచి రూ.16లక్షల నగదు దోచుకుని అనంతరం అతడిని కిడ్నాప్ చేసి రూ.50లక్ష డిమాండ్ చేశారన్నారు. ఈకేసును పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎట్టకేలకు చేధించారన్నారు. గ్యాంగ్‌కోసం పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్రలకు వెళ్లి దర్యాప్తు చేశారన్నారు. మహ్మద్ ఖలీల్‌వుల్లా బాంబే సలీంను, అతడి 8మంది సహచరులను అరెస్టు చేశారన్నారు. 5 హత్య కేసులు, 4 దోపిడీలు, 2 చోరీలు, 2 కిడ్నాప్ కేసులు ఇలా 20కుపైగా కేసులు వారిపై నమోదైనట్టు తెలిపారు. నిందితులనుంచి రూ.30లక్షల విలువైన ఇన్నోవా కారు, రూ.5.15లక్షల నగదు, 2 ద్విచక్రవాహనకారులు, ఒక చాకు, మచ్చు, రెండు ఐరన్‌రాడ్‌లు, స్వాధీనం చేసుకున్నారన్నారు. కేసును చేధించిన పోలీసు బృందాన్ని అభినందించారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తలకాయలబెట్టపై కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. తహసీల్దారు బీఎన్ స్వామి రథోత్సవాన్ని ప్రారంభించగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప, ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్, కాంగ్రెస్ నాయకులు పుట్టు ఆంజనప్ప, రాజీవ్‌గౌడ, బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ, సందీప్‌రెడ్డి, వ్యవస్థాపనా సమితి అధ్యక్షుడు డీపీ నాగరాజ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. తేరుకు ఉన్న తాళ్లను భక్తులు భక్తితో పట్టుకుని గోవింద నామస్మరణతో లాగారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి భక్తులు తరలిరాగా వారికి తీర్థప్రసాదాలు, అన్నదాసోహం పంపిణీ చేశారు. మరోవైపు జాతరలో భాగంగా పరుషలో వందలాది పశువులను తీసుకొచ్చారు. జాతరలో పలురకాల తినుబండారాలను చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా కొనుగోలు చేశారు.

దేశాల మధ్య సత్సంబంధాలు పెరగాలి



శ్రీలంక మాజీ హై కమిషనర్ మిలిండా మొరగోడ

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇండియా, శ్రీలంకల మధ్య సత్సంబంధాలు పెరగాల్సిన అవసరం ఉందని శ్రీలంకదేశ మాజీ హై కమిషనర్ మిలిండా మొరగోడ అభిప్రాయపడ్డారు. నగరంలోని ఎంఎస్ రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్‌లోని సెంటర్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ స్టడీస్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు, వృత్తి నిపుణులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. దేశాలమధ్య సత్సంబంధాలు పెరిగేందుకు మంచి పాలసీలు అవసరమన్నారు. ఇండియా స్ట్రాటజిక్ స్టడీస్ ప్రోగ్రామ్ విభాగాధిపతి బాలసుబ్రమణియన్, సీఎన్ఎస్ఎస్ కౌన్సిల్ సభ్యుడు పీఎం హెబ్లికర్ తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

రక్తహీనతతో జబ్బులు అధికం

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రక్తహీనత కారణంగా జబ్బులు అధికమని ముందస్తుగా గుర్తించి పౌష్టికాహారం తీసుకోవాలని రెయిన్‌బో ఆసుపత్రుల పీడియాట్రిక్ హెమటాలజీ ఎండీ వసుధ ఎన్ఆర్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ అనీమియా జాగృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రక్తహీనతతో ఆయాసం, తలతిరగడం, శ్వాసకోశ సమస్యలు వస్తాయన్నారు. పౌష్టికాహార కొరత, నాసిరకం ఆహారం తీసుకోవడం వంటివి కారణాలు కావచ్చునన్నారు. రక్తహీనత ఉంటే మలేరియా, క్షయతోపాటు పలు జబ్బులు వస్తాయన్నారు. నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాల వ్యాధులకు కారణం కానుందన్నారు. ఆహారంలో అన్ని పోషక పదార్థాలు సమతుల్యతను పాటించాలన్నారు. గర్భిణీలకు హెమోగ్లోబిన్ తక్కువైతే పిల్లలపైనా ప్రభావం చూపనుందన్నారు. వైద్యుల సలహాలు పాటించి రక్తహీనతనుంచి బయటపడాలని సూచించారు.

భాగప్ప హరిజన్ హత్య కేసులో నలుగురి అరెస్టు

బెంగళూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విజయపురలో రెండురోజులక్రితం హత్యకు గురైన రౌడీషీటర్ భాగప్ప హరిజన్ కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ లక్ష్మణ్ నింబరగి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ భాగప్ప హత్యకేసుతో సంబంధం ఉన్న ప్రకాశ్ మేలినకేరి అలియాస్ పింటు, రాహుల్ బీమాశంకర్ తళకేరి, సుదీప్ కాంబళె, మణికంఠ బెనకుప్పలను అరెస్టు చేశామన్నారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలతోపాటు ఆటో, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆస్తుల విషయంలో రవి, భాగప్పల మధ్య గొడవ జరిగిందని, ఏడాదిక్రితం భాగప్ప శిష్యులు రవిని హత్య చేశారన్నారు. ఇటీవల భాగప్ప హరిజన్, రవి తమ్ముడు ప్రకాశ్‌ను ఉద్దేశించి అనుచితంగా మాట్లాడారన్నారు. హత్యకు గురైన రవి భార్యను పంపాలని వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. ఇదే కక్షతోనే ప్రకాశ్ మేలినకేరి పగ తీర్చుకున్నాడన్నారు. వీరిలో రాహుల్ మినహా మిగిలినవారు ఎవరూ నేరాలతో సంబంధం లేనివారన్నారు.

వైదేహిలో యాసిడ్ దాడి బాధితురాలు

చికిత్స పొందుతున్న అన్నమయ్య జిల్లా యువతి

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించిన యువతికి వేరొక యువకుడితో వివాహం నిశ్చయం కావడంపై యువకుడు ఉన్మాదిలా వ్యవహరించిన ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా. యువతి ముఖంపై యాసిడ్‌తో దాడి చేసి కత్తితో పొడిచి గాయపరిచిన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం పేరంపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సదరు బాధితురాలిని మదన పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం బెంగళూరు వైదేహి ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనలో గౌతమిపై దాడి చేసిన గణేశ్ కూడా వెంటతెచ్చుకున్న పురుగులమందు తాగి కిందపడి పోయాడు. అతడిని కూడా మదనపల్లి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



యలహంక ఎయిర్‌బేస్‌లో వరుసగా పలు విమానాలు, నింగిలో విన్యాసం



సూర్యకిరణ్ విమానాలు

అబ్బురపరచిన విన్యాసాలు

బెంగళూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఏరోఇండియా 2025 విమానాల ప్రదర్శన సందర్శకులను అబ్బురపరిచాయి. ఐదు రోజులపాటు బెంగళూరు యలహంక ఎయిర్‌బేస్‌లో వైమానిక ప్రదర్శనలు కొనసాగాయి. శుక్రవారం ప్రదర్శనలు ముగిశాయి. 15వ విడత ఎయిర్‌షో విజయవంత మైంది. 15వ విడత ఏరో ఇండియా ప్రదర్శనలు అద్భుతం అనిపించేలా నిర్వహించారు. ఈనెల 10న కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రదర్శనలు ప్రారంభించారు. మూడురోజులపాటు బిజినెస్, డిఫెన్స్ తదితర విభాగాలకు మాత్రమే అవకాశం ఉండేది. 13, 14 తేదీలలో ప్రజలందరూ వీక్షించేందుకు అవకాశం ఉండడంతో లక్షలాది మంది తరలివచ్చారు.



భారీ యుద్ధ విమానాన్ని వీక్షిస్తున్న సందర్శకులు



సూర్యకిరణ్ విమానాల విన్యాసాలు



సూర్యాస్తమయం వేళ ఇలా...



వీక్షిస్తున్న చిన్నారి...



విన్యాసాలపై ఫోన్‌లో వివరిస్తూ...

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జస్టిస్ తాజ్‌అలి మౌలాసాబ్ నదాఫ్

బెంగళూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జస్టిస్ తాజ్ అలి మౌలాసాబ్ నదాఫ్ నియమిస్తున్నట్టు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. రెండేళ్ల అవధికి ఆయన కొనసాగనున్నారని ఈనెల 12న జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నారు. 2023 జనవరిలో సుప్రీంకోర్టు కొలీజియం నదాఫ్‌తో కలిపి ముగ్గురు లాయర్లను న్యాయమూర్తి హోదాకు సిఫారసు చేసిన సంగతి విదితమే. కర్ణాటక హైకోర్టులో మొత్తం 62 న్యాయమూర్తుల పోస్టులు ఉన్నాయి. 2025 ఫిబ్రవరి 1నాటికి 49మంది న్యాయమూర్తులు విధులు నిర్వహిస్తుండగా 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కాలేయ చికిత్సలకు ఐఐఎస్‌సీ శాస్త్రవేత్తల కొత్త విధానం



అత్యాధునిక యంత్రం

బెంగళూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాలేయం వైఫల్యం చెందిన బాధితులకు సహజసిద్ధంగా నయం చేయడంతోపాటు పునరుజ్జీవనంకు అనుకూలం చేసేలా అక్యూట్ లివర్ ఫెయిల్యూర్ చికిత్సలో కొత్త విధానాన్ని ఈబీడీఎల్ఆర్‌ను ఆవిష్కరించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ శాస్త్రవేత్తలు, బెంగళూరు వైద్యులు కలసి ఈ విధానాన్ని రూపొందించారు. అక్యూట్ లివర్ ఫెయిల్యూర్ జరిగితే మార్పిడి మినహా మరో చికిత్స లేదు. అటువంటి వారికోసం ఎక్స్‌ట్రా ఫ్లోరియల్ బయో ఇంజనీర్డ్ డ్యూయెల్‌సెల్ లివర్ రీజనరేషన్ సిస్టం యంత్రాన్ని సిద్ధం చేశారు. ఇది కాలేయం చేసే ప్రక్రియను కొనసాగించనుంది. తద్వారా రోగుల కాలేయం సహజంగా పని చేసేందుకు, కణాల ఉత్పత్తికి దోహదపడనుంది. దేశంలో తొలిసారి ఆవిష్కరితమైన ఈబీడీఎల్ఆర్‌ను జంతువులపై ప్రయోగం చేసి పరిణామకారి ఫలితాలు వచ్చినట్టు శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. కుందేలు, పందులపై ప్రయోగం విజయవంతమైందన్నారు. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) నుంచి అనుమతులు పొందినట్టు తెలిపారు. అక్యూట్ లివర్ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్న వేలాదిమందికి కొత్త జీవనం అందించేందుకు విప్లవాత్మక చికిత్సల కానుందని లివర్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్‌లిమిటెడ్ శాస్త్రవేత్త డాక్టర్ అక్షయ్‌డేటి తెలిపారు. ప్రముఖ లివర్ మార్పిడి వైద్యనిపుణుడు మహేశ్‌గోపశెట్టితోపాటు శాస్త్రవేత్త శివకుమార్ జనార్ధన్‌ల అభిప్రాయం మేరకు క్రిటికల్ కేర్ మెడిసిన్‌లో ఈ యంత్రం ద్వారా చారిత్రాత్మక మార్పులు సాధ్యమన్నారు.

యువత ఇష్టపడే రుచులు నిరంతరాయంగా..

బెంగళూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): యువత ఎక్కువగా ఇష్టపడే మొమోస్ రుచులు నగరంలో నిరంతరాయంగా అందుబాటులోకి తెచ్చామని గోద్రెజ్ ఫుడ్స్ సీఈఓ అభయ్‌పర్నేకర్ ప్రకటించారు. శుక్రవారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో 26శాతం చికెన్ మొమోస్ ఇష్టపడతారన్నారు. వాటి పట్ల యువత, చిన్నారులు ఆసక్తి చూపుతున్నందున నగరంలో నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా తీసుకొచ్చామన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడ్డాం



అదనపు తరగతి గదుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మహదేవపుర, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడ్డామని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి పేర్కొన్నారు. కాడుఅగ్రహార ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కిత్తగనూరు, మార గొండనహళ్ళి, దొడ్డబనహళ్ళి, కన్నమంగల ఎస్సీ కాలనీలో రోడ్ల అభివద్ధి, డ్రైనేజీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో రూరల్ బీజేపీ అధ్యక్షుడు పిళ్ళప్ప, నటరాజ్, బిదరహళ్ళి రాజేశ్, కేవీ నాగరాజ్, లోకేశ్, అనిల్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

వాత్సల్య ఇల్లు అప్పగింత

బాగేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మిట్టేమరి గ్రామ పరిధిలోని చౌడమ్మకు ధర్మస్థళ ధర్మాధికారి డాక్టర్ వీరేంద్రహెగ్డే ఆధ్వర్యంలోని జ్ఞానవికాస కార్యక్రమంలో భాగంగా వాత్సల్య పేరిట ఇంటిని అప్పగించారు. సంస్థ సామాజిక సేవలో భాగంగా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని యోజనాధికారి ప్రవీణ్, ప్రాంతీయ జ్ఞాన వికాస్ యోజనాధికారి సంధ్య తెలిపారు. కార్యక్రమంలో పీడీఓ వెంకటేశ్, వీఎస్ఎస్ఎన్ కార్యదర్శి విజయకుమార్, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సీతమ్మ పాల్గొన్నారు. లబ్ధిదారురాలు చౌడమ్మ రిబ్బన్ కట్ చేయడం ద్వారా వాత్సల్య ఇంటిని ప్రారంభించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ గూడు లేనివారికి సంస్థ కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో సంధ్యాశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బొలికొండ బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వసంతోత్సవంతో ముగిశాయి. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో స్వామివారు, అమ్మవార్లను అధిష్టించి గ్రామవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. రాత్రి 9 గంటలకు స్వామివారికి ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారు జక్కలచెరువుకు చేరుకుని, గ్రామంలో ఊరేగారు. వసంతోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి.

రూ.9.40 లక్షల ఆదాయం

బొలికొండ రంగనాథస్వామి దేవాలయంలో శుక్రవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. గత 9 రోజులు భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. రూ.9.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు, రవిస్వామి, చేతన్ వర్మ, లికిల్‌వర్మ, రాఘవేంద్రచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1612.98	1,587.92
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,717	163
నీటి నిల్వ (టీఎంసీలు)	43.79	9.38

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

సిరుగుప్ప, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తాయమ్మదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికి భక్తులు పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. అర్చకులు శ్రీనివాస, ప్రవీణ్ అమ్మవారికి పుష్పాలంకరణ సేవలు చేసి ఆకుల పూజ చేశారు. అనంతరం మహామంగళహారతి ఇచ్చారు.

మాజీ సైనికుల కొవ్వొత్తుల ర్యాలీ



నగరంలో కొవ్వొత్తుల ప్రదర్శన

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో పుల్వామా దాడిలో అమరవీరులైన సైనికులకు ఆత్మశాంతి చేకూరాలని మాజీ సైనికుల ఆధ్వర్యంలో మోతి సర్కిల్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పుల్వామా దాడిలో అమరులై ఆరు సంవత్సరాలు కావడంతో నగరంలో మాజీ సైనికులు ఈశ్వరరెడ్డి, ప్రహ్లాదరెడ్డి, రాజసింహ, లక్ష్మన్న, సురేష్, వీరేష్, రాజశేఖర్, గృహ రక్షణ దళ షేక్ సాబ్, రెడ్ క్రాస్ సమయం జెట్టీ పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలకు హెల్ప్‌లైన్‌ను సంప్రదించండి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ యూనిట్ ఆధ్వర్యంలో వివిధ రెవెన్యూ సేవలలో ఏదైన వ్యత్యాసం ఉంటే ప్రజలు కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ నంబర్ 08392-277100ను సంప్రదించవచ్చని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా కోరారు. జిల్లా రెవెన్యూ యూనిట్‌లోని గ్రామ పరిపాలన అధికారులు వివిధ డిమండ్ల కోసం 3-4రోజులుగా సమ్మెలో ఉన్నారని వారు అందించే రెవెన్యూ సేవలకు సంబందించిన ఏదైనా సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

దివ్యాంగుల చట్టాలు అమలు చేయాలి

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగుల హక్కుల చట్టాలను అమలు చేయాలని కర్ణాటక రాష్ట్రం కమిషనర్ దాస్ సూర్యవంశీ అన్నారు. శాసనసభ్యులు సతీష్ దివ్యాంగుల కోసం విధాన పరిషత్‌లో గొంతు వినిపించినందుకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం దివ్యాంగులకు రక్త వినియోగం రిజర్వ్ పోస్టులు భర్తీ చేయాలని స్వయం ఉపాధి అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను కమిషనర్ సన్మానించారు.

విద్యార్థిపై కోతి దాడి

కంప్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకా పరిధిలోని మెట్రి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హేమాద్రి అనే విద్యార్థిపై నల్లముచ్చుకోతి దాడిచేసి గాయపరిచింది. ప్రతినిత్యం నల్లముచ్చు కోతి మధ్యాహ్న భోజనంలో పాల్గొని ఆహారం తిని తిరిగి కొండల్లోకి, చెట్లపైకి వెళ్లేది. శుక్రవారం ఉన్నపళంగా భోజనం అనంతరమే అక్కడున్న విద్యార్థిపై దాడి చేసిందని ప్రధానోపాధ్యాయుడు మూర్తి తెలిపారు. వెంటనే గ్రామ పంచాయతీ అధికారులు నల్లముచ్చుకోతులను బంధించి విద్యార్థులకు ఎలాంటి హాని కలగకుండా చూడాలన్నారు. విద్యార్థిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



విద్యార్థిని వద్ద తింటున్న కోతి, దాడిలో గాయపడిన విద్యార్థి

చెట్ల కిందే చదువులు..!

- గదుల కొరతతో విద్యార్థుల ఇబ్బందులు
- మూడు గదుల్లో 316 మంది..
- పట్టించుకోని విద్యాశాఖ



చెట్టు కింద విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తామని హామీలు ఇచ్చిన నేతల మాటలు నీటిమూటలయ్యాయి. ఏటా విద్యా రంగానికి అందులో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పన కోసం కోట్లాది రూపాయలు విడుదల కేవలం కాగితాలకే పరిమితయ్యాయనడానికి పైన కనిపిస్తున్న దృశ్యాలే నిదర్శనం.. బళ్లారి జిల్లా, తెక్కలకోట ఫిర్కా పరిధిలోని బలకుంది గ్రామంలో హైస్కూలు విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు లేకపోవడంతో ఆరుబయట, చెట్టు కింద విద్యార్థులు చదువుకుంటున్నారు. ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని జిల్లాలతో సమానంగా బళ్లారి జిల్లాకు నిధులు కేటాయిస్తారు. ఇవి కాదని కళ్యాణ కర్ణాటక అభివృద్ధి బోర్డు పరిధిలోకి వస్తున్న కారణంగా ఈ భాగంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. అయితే నిధులు ఎక్కడికి వెళుతున్నాయో అర్థం కావడం లేదు. కేకేఆర్‌డీబీ నిధుల కింద ప్రజాపనుల శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పాఠశాలల అభివృద్ధికి ఏటా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తూ టెండరు ద్వారా పనులు చేపడుతుంది. పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా జిల్లా పరిధిలో పలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠశాల ఆవరణంలోని ఆరుబయట, చెట్ల కింద చదువుకోవాల్సిన దుస్థితి విద్యార్థులకు ఏర్పడడం శోచనీయం. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నా, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. పాఠశాలలో 8 నుండి 10వ తరగతి చదివే విద్యార్థులు 316 మంది ఉన్నారు. వీరిలో 8వ తరగతిలోనే 68 మందిఉండగా, 9, 10వ తరగతి విద్యార్థులు మొత్తం 114 మంది ఉన్నట్లు ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. విద్యార్థుల కోసం 7 తరగతి గదులు ఉండగా, ల్యాబ్, కార్యాలయం, వచనాలయం, క్రీడా సామగ్రి, కంప్యూటర్ ల్యాబ్‌కు ఒక్కోక్కటి పోగా మిగిలిన మూడు తరగతి గదుల్లోనే 316 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 9, 10 రెండు తరగతి గదులు రెండు సెక్షన్‌లు చేస్తే మొత్తం ఐదు తరగతి గదులు కావాల్సి ఉంటుంది. అయితే తరగతి గదుల కొరత కారణంగా 9, 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల ఆవరణంలోనే చెట్లనీడలో విద్యాబోధన చేయాల్సి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇక వర్షాకాలంలో ఒకే తరగతి గదిలో వందమందికిపైగా విద్యార్థులను కూర్చోబెట్టాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. పాఠశాలకు విద్యార్థులు హాజరు శాతం తక్కువ ఉన్న కారణంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి తల్లితండ్రులను ఒప్పించి హాజరు శాతం పెంచామని, పాఠశాలలో విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో తల్లితండ్రులు ప్రశ్నిస్తున్నారని ఉపాధ్యాయులు అంటున్నారు. విద్యాశాఖాధికారికారులు స్పందించి అదనపు గదులు నిర్మించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

నిధుల కొరతతో గదులు నిర్మించలేదు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యాభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన 'అక్షర ఆవిష్కార' పథకంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల అభివృద్ధికి నిధులు అందలేదు. ఎమ్మెల్యే నిధుల కింద తరగతి గదులు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరాం. నిధులు వచ్చిన వెంటనే అదనపు గదులు నిర్మిస్తాం.

-హెచ్.గురప్ప, క్షేత్ర శిక్షణాధికారి, సిరుగుప్ప



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప

తాగునీటి సమస్య రానివ్వొద్దు: ఎమ్మెల్యే

హోస్పేట (విజయనగరం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని విజయనగర ఎమ్మెల్యే గవియప్ప సూచించారు. హోస్పేట తాలూకా పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కేడీపీ ప్రగతి సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే బడ్జెట్‌లో అత్యంత ముఖ్యమైన పనులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తానని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరిదశలో ఉన్నందున రాష్ట్రం నుంచి వచ్చే ఏ గ్రాంట్ వృథా కాబోదని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యానవన శాఖ ద్వారా ఉచితంగా కూరగాయల విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. తాలుకా పంచాయతీ మహిళా సంఘం ప్రతినిధులకు యూనిఫాంలు, గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ వివేకానంద, తాలుకా పంచాయతీ కార్య నిర్వాహక అధికారి లక్ష్మీకాంత్, తహసీల్దార్ శృతి మల్లప్ప గౌడ్రు, తాలుకా పంచాయతీ పరిపాలనాధికారి సుధీర్, నామినేటెడ్ కేడీపీ సభ్యులు దివాకర్, చంద్రశేఖర్, జానకి రామ్, పీసీఆర్‌డీ బ్యాంకు అధ్యక్షులు అమ్మాజీ హేమన్న సహా తాలుకా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదలతో అనుకున్నది సాధించాలి



బదిలీ అయిన టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదల దీక్షతో చదివితే సాధించనిది ఏదీలేదని తాలుకా శిక్షణ అధికారి సిద్దలింగ మూర్తి అన్నారు. దేవలాపురం గ్రామంలో ప్రాథమిక, హైస్కూలు పాఠశాలల వార్షికోత్సవం, సరస్వతి పూజకార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తాలుకాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉత్తమ శిక్షణ ఇస్తున్నారన్నారు. రాబోయే పది పరీక్షల్లో 85 శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణులవుతారన్నారు. ఎం నాగన్నగౌడ, అధ్యక్షులు బసవరాజు, దొడ్డ బసప్ప, హనుమంతప్ప, రేవణ్ణ, వీరేష్, రేణుకారాధ్య, చంద్రయ్య, భీమేష్, హెచ్‌ఎం సోమశేఖర్, పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

కిత్తూరు రాణిచెన్నమ్మ సర్కిల్ ఏర్పాటు చేయాలి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న లింగాయత్ సమాజం ప్రముఖులు

కంప్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణం హోస్పేట బైపాస్ రోడ్డు డిగ్రీ కళాశాల ఎదురుగా వీరవనిత కిత్తూరు రాణిచెన్నమ్మ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని వీరశైవ లింగాయత్ పంచమశాలి సమాజం ఆధ్వర్యంలో పురసభ ముఖ్య అధికారి దుర్గన్నకు, అధ్యక్షులు బట్టాప్రసాద్‌కు విన్నవించారు. సమాజం అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ మాట్లాడుతూ గండుగలి కుమార రామకోటి ఎలా ప్రఖ్యాతి గాంచిందో అలాగే హోస్పేట బైపాస్ రోడ్డు సర్కిల్‌లో కిత్తూరు రాణి చెన్నమ్మ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. బీవీ గౌడ, రేణుకగౌడ, శరణుగౌడ, రాజశేఖర్, శంభులింగ, రవీంద్ర, శరణప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పించాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌యూసీఐ నాయకులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. అంతరం బిమ్స్ అధికారులకు, జిల్లా యంత్రాంగానికి వినతి పత్రం సమర్పించారు. డాక్టర్ ప్రమోద్, దేవదాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెరుగుతున్న మాతాశిశు మరణాలను నివారించాలన్నారు. బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. బళ్లారి మెడికల్ కాలేజీ ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రితో సహా వివిధ స్థాయిల ఆసుపత్రులలో అవసరాన్ని బట్టి వైద్యులు, ఇతర సిబ్బందిని శాశ్వతంగా నియమించాలని కోరారు. రోగులకు అనుభవజ్ఞులైన వైద్యుల సేవలు 24గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష నివేదికలు సులభంగా అందుబాటులో ఉండాలన్నారు. బళ్లారి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలన్నారు. క్యాన్సర్ విభాగంలో నైపుణ్యం కలిగిన నిపుణులు, అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. బీపీఎల్ కార్డుదారులకు దీన్ని పూర్తిగా ఉచితంగా అందించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోగుల బంధువులు బస చేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. అంబులెన్స్‌ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రామకృష్ణ, మంజుల దేవదాస్, డాక్టర్ ప్రమోద్, సోమశేఖర్‌గౌడ, గోవింద పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను బెదిరించిన వారిని అరెస్టు చేయాలి

సిరుగుప్ప, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాల మార్పిడి విషయంలో తహసీల్దార్ విశ్వనాథ్‌ను ఫోన్‌లో బెదిరించిన ఇక్బాల్‌ను అరెస్టు చేయాలని రెవెన్యూ అధికారులు డీఎస్పీ వెంకటేష్‌ను కోరారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో డీఎస్పీని కలసి వినతిపత్రాన్ని అందజేశారు. తాలుకాలోని దేశనూరు, ఇబ్రహీంపురం భూములకు సంబంధించి సర్వే నెంబర్ 601, 117లలో తమ పేరిట మార్పిడి చేయాలని హోస్పేటకు చెందిన ఇక్బాల్ అనే వ్యక్తి ఫోన్‌కాల్‌లో బెదిరించిన విషయం పాఠకులకు విదితమే. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తక్షణమే అతనిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ, పరమేష, రామప్ప, గౌరవాధ్యక్షులు విరుపాక్షి పాల్గొన్నారు.



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది

గుణాత్మక విద్య కోసం ప్రణాళిక అవసరం: డీసీ



జ్యోతి ప్రజ్వలన ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీ నితీశ్

రాయచూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కల్యాణ-కర్ణాటక ప్రాంతంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే రాయచూరు జిల్లాలో బోధన పరంగా వెనకబాటుతనం ఉన్నట్లు జిల్లాధికారి కే నితీశ్ అన్నారు. గుణాత్మక విద్యనందించేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని డీసీ అన్నారు. శుక్రవారం నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన విద్యావంతుల మూడో సమావేశంలో ఆయనపాల్గొని మాట్లాడారు. విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యాభిమానులు, మేధావులు విద్యా బోధన మరింత గుణాత్మకంగా సాగించేందుకు సూచనలు అందించాలని కోరారు. జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు బోధనకు సవాలుగా మారాయన్నారు.

నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోండి: డీహెచ్ఓ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆరోగ్య అధికారులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నోటి ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని డీహెచ్ఓ డాక్టర్ రమేశ్‌బాబు సూచించారు. నోటి సంబంధిత ఆరోగ్య సమస్యలకు అన్ని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. జాతీయ నోటి ఆరోగ్య కార్యక్రమం కింద జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి కార్యాలయ ఆడిటోరియంలో శుక్రవారం దంత వైద్యుల కోసం వైద్య అధికారులు నిర్వహించిన సమాచార కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మానవ శరీరంలోని అతిముఖ్యమైన అవయవాలలో నోరు ఒకటని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా నోటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. డెంటల్ కళాశాల సహకారంతో జిల్లావ్యాప్తంగా ప్రతి మంగళవారం ఒక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి పౌరుడు దీనిని సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దంతభాగ్య యోజన పథకం కింద 45 ఏళ్ల పైబడిన బీపీఎల్ కుటుంబాల పౌరులకు ప్రభుత్వ ఆసుపత్రులలో పరీక్షించి, బళ్లారి ప్రభుత్వ దంత కళాశాలలో ఉచితంగా దందాలు అందించామని ఆయన అన్నారు. ఓరల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విశాలాక్షి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో దంతవైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లాకుంటుంబ సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ పూర్ణిమ కట్టిమనె, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి అబ్దుల్లా, డాక్టర్లు ఇంద్రాణి, మరియంబి, వీరేంద్రకుమార్, హనుమంతప్ప, ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్ దాసప్ప, గిరీశ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల రక్షణకు కృషి

- దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్




మాట్లాడుతున్న సూర్యవంశీ

రాయచూరు, ఫిబ్రవరి 14 : దివ్యాంగుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సమగ్ర చట్టాలు అమలు జరిగేలా తమ వంతు బాధ్యత తీసుకుంటామని దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ దాస్ సూర్యవంశీ అన్నారు. శుక్రవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో దావ్యాంగుల హక్కులు వారికి ఎదురవుతున్న సమస్యలు, ప్రభుత్వ పరంగా అందాల్సిన సౌకర్యాలపై కమిషనర్ నేతృత్వం విస్తృత చర్చ జరిగింది. సమావేశంలో పాల్గొన్న మహిళ ఒకరు తన సమస్యలను వివరిస్తూ కన్నీటిపర్యంతమైయ్యారు. రెండేళ్లుగా తాను జిల్లా గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తున్నానని జీతాలు సరిగ్గా అందడం లేదని ఉద్యోగం కోసం దరఖాస్తు చేయాలన్నా ఎవరూ స్పందించడం లేదన్నారు. పలువురు దివ్యాంగులు మాట్లాడుతూ సంక్షేమ సంఘం ప్రతినిధులు జిల్లాలో దివ్యాంగులకు ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రోత్సహం అందడం లేదని చైర్మన్ దృష్టికి తెచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కారమైయ్యేలా తనవంతు కృషి చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు.

హోసూరు జోన్

తరగతి గదులు ప్రారంభం

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో చెన్నైలోని సెక్రటేరియట్ నుంచి తమిళనాడు ముఖ్యమంత్రి వీడియోకాన్ఫెరెన్స్ ద్వారా ఎనిమిది అదనపు తరగతి గదులు, రెండు ప్రయోగశాల భవనాలను శుక్రవారం ప్రారంభించారు. రూ.14కోట్లతో నూతన నిర్మాణాలు చేపట్టారు. బర్గూరు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు, ప్రయోగశాల భవనాన్ని కలెక్టర్ ఎస్.దినేశ్ కుమార్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం భవన సముదాయాన్ని సందర్శించి విద్యార్థులతో చర్చించారు. తళి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో తళి ఎమ్మెల్యే టి.రామచంద్రన్, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక జ్యోతిని వెలిగించారు. బర్గూరు ప్రభుత్వ కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్‌లో, కామరాజర్ కళాశాల డెవలప్‌మెంట్ స్కీమ్ క్రింద రూ.4 కోట్లతో 1466.10 చదరపు మీటర్ల (15781.10) చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎనిమిది తరగతి గదులు, రెండు ప్రయోగశాల భవనాలు నిర్మించబడ్డాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 1 లేబోరేటరీ, 2 తరగతి గదులు, మొదటి అంతస్థులో కూడా తరగతి గదులు నిర్మించారు. అదేవిధంగా తళి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కూడా 4849.37 చదరపు మీటర్ల (52199 చదరపు అడుగులు) విస్తీర్ణంలో రూ.14 కోట్ల 74 లక్షల 86 వేలతో నూతన విద్యా భవనాలను నిర్మించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుణావకరసు, బర్గూరు మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నబీషాబేగం, జిల్లా కలెక్టర్, తదితర అధికారులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

మట్టి కుండలు రెడీ..



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మట్టి కుండలు

హోసూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తుండడంతో సహజ సిద్ధమైన మట్టి కుండలకు డిమాండ్ నెలకొంది. వారం రోజులుగా ఎండలు అధికంగా ఉండడంతో చల్లటి పానీయాలకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇలా తాగునీరు, చెరుకురసం, కొబ్బరిబోండాలకు డిమాండ్ ఉంటోంది. నాగరికత అభివృద్ధితో రోజు రోజుకు రిఫ్రిజిరేటర్‌లు మరింత అందుబాటులో ఉండడంతో మట్టి కుండలపై ఆసక్తి తగ్గింది. ఈ తరుణంలో కొలాయిలతో కూడిన మట్టికుండలు మార్కెట్‌లోకి అందుబాటులో రావడంతో ప్రజలు మళ్లీ వీటిపై దృష్టి సారిస్తున్నారు. హోసూరు, బాగలూరు, ఉద్దనపల్లి, బేరికపల్లి ప్రాంతాల్లో మట్టి కుండలను విక్రయిస్తున్నారు. కుమ్మరి కార్మికులు మాట్లాడుతూ ప్రస్తుతం మట్టి కుండలపై ప్రజల్లో తగినంత అవగాహన లేకపోవడంతో ప్రతి సంవత్సరం కూడా పొంగల్ సీజన్‌లలో మాత్రమే మట్టి కుండలు వాడతారన్నారు. ఇప్పుడు ఫ్రిజ్‌లలోని నీటి కంటే కుండలలో నీటికి ప్రాధాన్యతకు పెరిగిందన్నారు. ఇళ్లు, పాఠశాలల్లో, కళాశాలల్లో, వాణిజ్య సంస్థలలో మట్టి కుండల్లో నీరు ఉంచుతున్నారని తెలిపారు. 10-20 లీటర్ల వరకు రూ.250 నుంచి రూ.400 వరకు ధర పలుకుతోంది.

చంద్రచూడేశ్వర ఆలయంలో రెండు జంటలకు వివాహం

హోసూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని మరకతాంబ చంద్రచూడేశ్వర ఆలయంలో హిందూ ధార్మిక దేవదాయాశాఖ ఆధ్వర్యంలో రెండు జంటలకు ఉచిత వివాహం జరిపించారు. నూతన వధూవరులకు రూ.60వేల విలువైన కానుకలను అందచేశారు. హోసూరులోని కొండపై ఉన్న 800 ఏళ్ల నాటి చంద్రచూడేశ్వర ఆలయంలో తమిళనాడు హిందూ సంప్రదాయ ప్రకారం శుక్రవారం పెళ్లి చేశారు. తిరుపత్తూరు జిల్లా పుదుపట్టికి చెందిన కలైసెల్వన్, నత్తంకు చెందిన కౌసల్య, కృష్ణగిరి జిల్లా డెంకణీకోట అనుమంతపురం ప్రాంతానికి చెందిన సూర్య, శూలగిరి కామరాజనగర్‌కు చెందిన స్నేహకు పెళ్లి జరిగింది. వివాహం అనంతరం 4 గ్రాముల బంగారం, మంచం, బెడ్, మిక్సీ, మ్యాట్ తదితర వస్తువులను ఒక్కో జంటకు ప్రభుత్వం తరఫున అందించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ రజిని సెల్వం, సభ్యులు విజయకుమార్, లోకనాథన్, కార్యనిర్వాహణాధికారి సామిదురై, ఆలయ ధర్మకర్త వాచీశ్వరన్, పలువురు భక్తులు, వధూవరుల కుటుంబ సభ్యులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.



నూతన వధూవరులతో అధికారులు


నగరంలో డీఎండీకే వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

హోసూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం (డీఎండీకే) పార్టీ ఏర్పాటై ఇరవై సంవత్సరాలు పూర్తైన సందర్భంగా హోసూరు నగరంలో పలు చోట్ల జెండా ఎగురవేశారు. శుక్రవారం చాలా చోట్ల డీఎండీకే పార్టీ జెండా ఎగరవేసి స్వీట్లు పంచారు. కార్యక్రమానికి హోసూరు రాంనగర్ జిల్లా కార్యదర్శి రామస్వామిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర వలంటీర్ల ఉప కార్యదర్శి దినకరన్ పాల్గొన్నారు.

చెరువును పరిరక్షించండి



గుర్రపు డెక్కతో నిండిన చెరువు

హోసూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంల్లో అనుమేపల్లి చెరువును రక్షించాలని, చెరువులోని గుర్రపుడెక్క తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. హోసూరు పరిసర ప్రాంతాల్లో 100కు పైగా చెరువులు ఉండేవి. హోసూరు ప్రాంతంలో చుట్టు కర్మాగారాలు ఫ్యాక్టరీల కారణంగా కలుషితం అవుతుండగా మరికొన్ని కాలక్రమంలో కనుమరుగయ్యాయి. హోసూరు-అనుమేపల్లి పాఠశాల ప్రాంతంలో ఉప్కార్ లే అవుట్ సహా అనేక స్థలాలు ఉన్నాయి. చెరువు కలుషితం కావడంతో నీటి ని వాడుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కొంతకాలంగా గుర్రపుడెక్కతో చెరువు చాలావరకు ఆక్రమించింది. చెరువును కాపాడాలని హోసూరు ప్రాంత ప్రజలు కోరుతున్నారు. హోసూరు నగర ప్రాంతంలో రోడ్లపై మృతి చెందిన కుక్కలు, మాంస వ్యర్థాలు వంటిని చెరువులో పడేస్తుండడంతో నీరు కలుషితంగా మారడం మాత్రమే కాక దుర్వాసన కూడా వస్తుందని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.